**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**ANDHRA PRADESH COMMITTEE**
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ**
**తేదీ : జూన్ 29, 2016**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము.
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం : శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్ర నిర్మాణం నష్టదాయకం, హానికరం అయినందున విరమించుకోవాలి. – కేంద్రాన్ని ఆ విధంగా కోరాలి.**

గుజరాత్ రాష్ట్రంలోని మితివిర్ధి వద్ద తొలుత ప్రతిపాదించిన అణు విద్యుత్ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొవ్వాడకు మార్చినట్లు కేంద్ర ప్రభుత్వం జూన్ 5వ తేదీన ప్రకటించింది. జూన్ 8వ తేదీన ప్రధాన మంత్రి మోడీ, అమెరికా అధ్యక్షుడు ఒబామా కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రాన్ని వెస్టింగ్‌హౌస్ కంపెనీకి చెందిన 6 రియాక్టర్లతో నిర్మించబోతున్నట్లు అమెరికా నుంచి ప్రకటన చేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ జూన్ 9వ తేదీన కొవ్వాడ అణు విద్యుత్ కేంద్ర గ్రామాలకు సంబంధించిన సామాజిక ప్రభావ అంచనాపై భూసేకరణ చట్టం (2013) సెక్షన్ 4,5,6 క్రింద నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజు తేడాతో భూ అధికరణ ప్రక్రియను ప్రారంభించడం బట్టి కొవ్వాడ అణు ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆమోదిస్తున్నదని భావించాలి. ఈ నిర్ణయం రాష్ట్రానికి నష్టదాయకం.

కొవ్వాడలో వెస్టింగ్ హౌస్ నిర్మించే ఎ.పి.1000 తరహా అణు రియాక్టర్లను ప్రపంచంలో ఇంతవరకు ఎక్కడా పరీక్షించి చూడలేదు. అటువంటప్పుడు వాటిని మన భూభాగంపై అనుమతించడం ప్రజల భద్రతను గాలికి వదిలివెయ్యడమే అవుతుంది. పైగా ఒకే చోట అటువంటి రియాక్టర్లు ఆరింటిని నిర్మించడం అత్యంత ప్రమాదకరం. జపాన్‌లోని ఫుకూషిమా ప్రమాదం తరువాత ప్రపంచంలో జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అనేక దేశాలు అణు విద్యుత్‌కు ప్రత్యామ్నాయం వైపు మళ్ళుతున్నాయి. అణు విద్యుత్ టెక్నాలజీ అత్యంత ప్రమాదకరమని, అత్యధిక పెట్టుబడులు పెట్టవలసి వుంటుందని, విద్యుత్ ఖరీదు చాలా ఎక్కువని అన్ని విధాల నష్టాలు ఎక్కువ వున్నాయని నిపుణులు చెబుతున్నారు. మన ప్రజలమీద లక్షలకోట్ల భారాన్ని ఈ ప్రాజెక్టు మోపనున్నది. పైగా అక్కడ తయారయ్యే అణు విద్యుత్ ఒక యూనిట్‌కు సుమారు రూ.25లు అవుతుంది. ఈ భారాన్ని ప్రజలు మోయలేరు.

గుజరాత్‌లోని మితివిర్ధి పవర్ ప్లాంట్‌కు 2009లో నేషనల్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దరఖాస్తు చేసింది. దాని పర్యావరణ, అటవీశాఖ, సిఆర్‌జెడ్ అనుమతులన్నీ ఇప్పటికే పొందియున్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమ అని అక్కడి ప్రజలు వ్యతిరేకించినందున గుజరాత్ నుంచి తప్పించి ఆంధ్రప్రదేశ్ వైపు అణు విద్యుత్ కేంద్రాన్ని మళ్ళించారు. గుజరాత్ ప్రజలకు హానికరమైనది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రయోజనకరమౌతుందా? ముఖ్యమంత్రిగా మీరు ప్రజల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి అని భావిస్తున్నాం. అణు విద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగితే ఇటు 177 కి.మీ. మేరకు కాకినాడ వరకు, అటు ఒరిస్సాలోని ఛత్రపూర్ వరకు అణు ధార్మికత వ్యాపిస్తుందని అణు శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

సిపిఐ(యం)తరపున వ్రాసిన ఆర్‌టిఐ లేఖకు ఎటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు ఇచ్చిన సమాధానం ప్రకారం నేషనల్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) ఇంత వరకు కనీసం దరఖాస్తు కూడా చేయలేదని తెలియజేశారు. ఈ పరిస్థితిలో కొవ్వాడ పరిసర గ్రామాలకు భూ సేకరణ చట్టం సెక్షన్ 4,5,6 క్రింద ఇచ్చిన నోటిఫికేషన్ చట్ట వ్యతిరేకం. భూ సేకరణ చట్టం సెక్షన్ 10 ప్రకారం ఆహార భద్రత కోసం ఎంత విస్తీర్ణం అనుమతించాలో రాష్ట్ర ప్రభుత్వం నేటికీ నిర్ణయించలేదు. ఈ నిర్ణయం తీసుకోనంత వరకు భూ సేకరణ ప్రక్రియ మొదలుపెట్టడం చట్టవిరుద్ధం. ఈ నోటిఫికేషన్‌ను వెంటనే విరమించుకోవాలని కోరుతున్నాం.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అన్ని విధాలా హానికరం, నష్టదాయకం అయిన ఈ ప్రాజెక్టును తిరస్కరించకపోతే రాష్ట్ర వ్యాపితంగా ప్రజల నిరసనను చవిచూడవలసి వస్తుందని స్పష్టం చేస్తున్నాం.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి